
# అహం బ్రహ్మాస్మి

రాంశీ

నాకు చాలా మంది దేవుళ్ళున్నారు.

నా తాతల నాటినుంచీ వాళ్లని నేను మార్పులూ చేర్పులూ చేసు కుంటూ కొలుస్తూనే ఉన్నాను.




వాళ్లనే కాదు. వాళ్ల భార్యల్ని పిల్లల్నీ, భక్తుల్నీ కూడా నేను క్రమం తప్ప కుండా పూజించుకుంటూ వస్తున్నాను. మొదట్లో దేవుళ్ళు నా కన్నా భిన్నంగా కనిపించాలని 'పశు పక్ష్యాదు'ల రూపాల్లోనూ, ఆ తర్వాత మానవ శరీరానికి పశు పక్ష్యాదుల తలలతికించీ, ఎన్నో తంటాలు పడి_ పూజించుకుంటూ వచ్చాను.

ఆ దేవుళ్లందరూ అలా ఉంటుండగానే, పూర్తిగా మనిషి రూపంలో దేవుడుంటాడనే ఆలోచనొచ్చి నా రూపు రేఖల్లోనే దేవుణ్ణి తయారుచేసుకుని శతసహస్ర నామాలతో పిలుచుకుంటూ కొలుస్తున్నాను. అయితే... దేవుడు నా కన్నా విశిష్టంగా కనిపించాలనే ఆలోచనొచ్చి, నాకు రెండు చేతులే వుంటే... ఆయనకి మరో రెండుచేతులెక్కువ తగిలించాను.

కొందరు దేవుళ్లకైతే ... తలల సంఖ్యా — చేతుల సంఖ్యా పెంచుకుంటూ వెళ్లాను. ఇన్నేసి తలలూ — చేతులూ — కాళ్లతో ఆయనెలా తిరగగలడనే ఆలోచన నాకు రాలేదు.

దేవుడు కదా? ! ఆ మాత్రం తిరగలేడా?' అనుకున్నాను. నా దేవుణ్ణి సర్వాంతర్యామిని చేసి సృష్టిలోపటా — బయటా నిలుపుకున్నాను. ఆయనెవరో మరో రచయిత రాశార్ట. 'గేదెకనక దేవుడెలాగుంటాడని ఊహించుకుంటే. తన గేదె రూపంలోనే ఊహించుకుంటుందట. ఇప్పుడు నేను సృజించుకున్న నా దేవుడు నా మీదే సవారీ చెయ్యడం మొదలెట్టాడు ! తా తల్నాటి నించి వస్తున్న నా దేవుడు నా వరకూ వచ్చి... నన్నప హాస్యం చేస్తున్నాడు !?

ఇప్పుడు చెప్పండి. 'నాలో దేవుడున్నాడో? ! లేక నేనే దేవుడిలో వున్నానో? !'

ఆగండి ! చెప్పేముందు కొంచెం ఆలోచించి చెప్పండి దేవుళ్ళూ ! !
ఏంటలా తెల్లబోతున్నారు ? !

ఇక్కడ నేను "దేవుళ్ల"ని సంబోధించి మిమ్మల్నే !? ఎందుకంటే మీరు నాలానే ఆయన రూపంలో వున్నారు మరి !?

నాకున్నట్టే నా దేవుళ్లకీ 'కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలు' న్నాయండోయ్ ! వాళ్ళూ పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కన్నారు. 'అరిషడ్వర్గాల్ని' జయిస్తే ముక్తిని సాధించొచ్చునట. నా రూపంలో ఉన్న నా దేవుళ్ళే వాటిని జయించలేకపోతే నేనింకె పాటి?

“నాకనవసరంగా కోపం తెప్పించకు” అన్నాడు భర్త.
“ఏం చేస్తారు?” అడిగింది.
“వంట చేయడం మానేస్తాను” బెదిరించాడు???

—కలపర్తి సత్యం, ఏలూరు



నాకున్నట్టే. ఆయనకీ 'మిత్రులూ — శత్రులూ' వున్నారు. ఆయన్ని 'సంభవామి యుగే — యుగే' అంటారు.

అలా పుట్టినప్పుడల్లా ఆయన ఎందరెందరినో దుర్మార్గులని చెప్పి చంపేస్తుంటాడు. ఆయన చేసే హత్యలన్నీ ధర్మబద్ధమైనవిట ! ధర్మసంస్థాపనకి చేసినవిట ! ఇంకా చెప్పాలంటే ఆయన చేసే హత్యలన్నిటికీ ఎన్నో పూర్వాపరాలుంటాయిట ! 'గత జన్మలూ — భవిష్యత్ జన్మలూ' 'పాపాలూ — శాపాలూ' ఇలా ఒకటేమిటి? ఎన్నో వుంటాయిట.

ఎవరైనా బ్లాక్ మార్కెటీర్నీ, మోసాలు చేస్తున్న రాజకీయ నాయకుడిని ఎందరికో మేలు కలగాలని నేను 'హత్య' చేస్తే.. నన్ను జైల్లో వేసి ఆ తర్వాత ఉరి తీస్తున్నారు. నన్ను 'సంభవామి ఈ యుగే అనుకోడల్లేదు ఏమిటో? ఇదంతా నా కర్థం కాని, అయోమయంగా వుంది.

ఇప్పుడు నేనంటే....రోడ్డు వార ఆకలితో నక నకలాడుతున్నానండీ నేను 'దేవుడి'నని జనం అర్థం చేసుకోలేకపోతున్నారండీ. మరి 'మానవసేవే — మాధవసేవ' అని వాళ్లకి తెలియదా?

'బాబూ ఆకలి అమ్మా ఆకలి నాలుగు రోజుల నుంచి తిండి లేదు. ఇంత బువ్వెట్టండీ ! !' అని ఎంతో అడుక్కున్నాను. అసలు నేను వాళ్లకి కనిపిస్తేనా? ఓ వేళ పొరపాటు నెవరైనా నన్ను చూసినా అసహ్యించుకుంటున్నారు. 'వెధవ ! దరిద్రగొట్టు వెధవ ! దేవాలయం ముందు...' అని తిట్టుకుంటున్నారండీ.

వాళ్లందరూ పరమ భక్తులు. భాగవతోత్తములు ! ! వారి చేతుల్లో కొబ్బరికాయలు అరటిపళ్ళు. ఇంకా ఏవేవో తినే పదార్థాలు ! ! వారందరూ తలారా స్నానాలు చేసి ఊరి నడిబొడ్డున తాము కట్టుకున్న దేవాలయంలో కెళ్ళిపోతున్నారు. అక్కడి 'రాతి దేవుడి'కి నైవేద్యం పెడుతున్నారు 'నిజంగా దేవుడే దిగొచ్చి, వీళ్ళు నైవేద్యంగా ఇచ్చేవన్నీ 'హాం ఫట్ !' చేసేస్తే... వీళ్ళిలా నైవేద్యాలు పెడతారా? అనే అనుమాన మొచ్చి తెగ నవ్వుకున్నాను.

నా ఒంటిపై పాపిష్టి కుష్టువ్యాధి ఉందట. అదేం మాయదారి రోగమో? జబ్బు తగులుకున్న పద్నాలుగేళ్లగ్గానీ శరీరంమీద రోగ లక్షణాలు కనిపించవట!? ఇలాగని డాక్టర్లు చెప్పారు. గడ్డాలున్న వేదవేదాంగ పండితులూ, సర్వసంగ పరిత్యాగులూ, వారి కాళ్లకు మొక్కి వారి మాటల్నే నమ్మే పెద్దలూ... గత జన్మ పాపం నన్నిలా వెంటాడి వేధిస్తోందని సెలవిచ్చారు.

ఏదేమైనా తెలిసి తెలిసీ నేనీ జన్మలో ఏ పాపం చెయ్యలేదు. నా దేవుళ్లా నేనే వ్యవహారాలు నడపలేదు. ఆయనన్నడిపినవన్నీ 'శృంగార చేష్టలం'డి. నా దేవుడికో సారి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుందట. అందువల్లే ఆయనకీ కుష్టు వ్యాధి వచ్చిందిటండి. ఆరోగ్యం పోగొట్టుకుందుకాయన ఎన్నోచోట్ల తిరిగి గడప దాటకుండా 'భిక్ష' వేసిన వారికా రోగాన్నంటగట్టి చల్లగా జారుకున్నాట్టండి. ఇవన్నీ పురాణేతిహాసాల్లో రాసున్నాయని అవి చదివిన సన్యాసులు చెప్పారు. 'నా దేవుడు చేసినట్టుగా నాకున్న రోగాన్ని ఇతరులకంటగట్టాలనే దుర్బుద్ధి నాకు లేదు'. నాకు దేవుడిచ్చిన ఈ రోగాన్ని ప్రేమగా తీసుకుని నేనే ప్రజలకు దూరంగా ఉంటున్నాను. ప్రభుత్వం వారేదో ఈ డబ్బుకి మందులూరికే ఇస్తున్నారంటే అవి మింగుతున్నాను. అయినా కడుపు నిండా తిండిలేని నాకా మందులేం పన్చేస్తాయి చెప్పండి!? ఆ మందులు పని చెయ్యకపోయినా ఫరవాలేదు గానీ, అవి మింగినందువల్ల కడుపులో మంటగా ఉంటోందండి! సన్యాసుల దగ్గరేవో మహిమలుంటాయనీ, వారేదో క్షణాల్లో నా రోగాన్ని నయం చేస్తారంటే నేనూ నమ్మానండి. కాని ఏ సన్యాసీ నా రోగం కుదర్చలేడని తెలుసుకుని 'వైద్యో నారాయణో హరీ' అని డాక్టర్లను ఆశ్రయించాను. కొద్దికొద్దిగా ఇప్పుడిప్పుడే గుణం కనిపిస్తున్నా కడుపులోకి తిండిలేక ఏడుస్తున్నానండి!

నా శరీరంపై బట్టలు చిరిగిపోయి నేను చలికి వజవజలాడుతున్నానండి. నా ఈ దీనస్థితికి కారణం నాకు శని పట్టిందన్నారు. అదేం శనో?! అది నన్నే కాదండి. నా దేవుడ్నీ ఓసారి పట్టుకుందిట. అప్పుడాయన పాపం చెట్టు తొర్రలో దాక్కున్నాట్ట.

పాపోహం! 'పాపాత్మా! పాపసంభవా....' గుళ్లో పూజారి మంత్రాలు చదువుతున్నాడు. భక్తులు దేవుడి ముందు ఆత్మప్రదక్షిణలు చేసి చెంపలు వాయించుకుని దణ్ణాలు పెడుతున్నారు. ఒకరికొకరు సహాయం చేసుకోవాలనే కనీస జ్ఞానంలేని అజ్ఞానులు. దేవుని చేరుకోవడానికి ఎవరికి నచ్చిన తోవల్లో వారు నడుస్తున్నారు. అందరి కోరికా దేవుణ్ణి చేరుకోవడమే అయినా, వారి మార్గాలు వేరవడంతో వాళ్లలో వాళ్లు కొట్టుకు చస్తున్నారు. మా మతం గొప్పదంటే, మా తం గొప్పదని అరుచుకుంటూ మూర్ఖులైపోతున్నారు. వాళ్లంతా పాపం వల్ల పుట్టామనుకుంటున్నారు. నేనుమాత్రం ఎంతో పుణ్యం చేసుకుని భూమ్మీ పడ్డాననుకుంటున్నాను. గత జన్మ మాటేమోగానీ ఈ జన్మలో వీళ్లన్నో పాపాలు చేసే వాటిని ప్రక్షాళనం చేసుకునేందుకు గుళ్లోకొస్తున్నార

నుకుంటున్నానండి. ఎందుకంటే నన్ను మోసం చేసి నన్నీ స్థితికి దిగజార్చిన వాళ్లెందరో గుళ్లోకెళ్లడం చూస్తున్నాను. నేనెంతోకాలం భూమిని పండించి, రైతన్నగాను, అన్నదాతగానూ పేరు పొందానండి. చివరికెందరో దోపిడీదార్ల చేతుల్లో నలిగిపోయి ఇప్పుడీ స్థితికొచ్చాను. చట్టాలూ— కోర్టులూ దోపిడీదార్ల వెనకే నిలబడి నన్నన్యాయం చేశాయి.

‘రాజాధిరాజాయ స్వయంవై... గుళ్లో పూజారిగారు మంత్రపుష్పం చదువుతున్నట్టున్నారు. మైక్‌లో జోరుగా వినిపిస్తోంది. డబ్బులకు రెక్కలొచ్చి ఎగిరెళ్లి హారతి పళ్లెంలోనూ, హుండీల్లోనూ పడి రెక్కలు విరక్కొట్టుకుంటున్నాయనుకుంటానండి. పొందబోయే ఉత్కృష్ట జన్మ గూర్చీ, ప్రస్తుత జర్మలో ఇంకా ఇంకా పాపాలు చేస్తూ సుఖాల్ని పొందే ఆశలతో ఒక్కొరొక్కరే గుళ్లోంచి బైటకొస్తున్నారండీ! వచ్చేవాళ్ళూ— వెళ్లేవాళ్లతో గుడి కిటకిటలాడుతోందండి! వాళ్లని చూస్తున్న నాకిప్పుడెంతో సంతృప్తిగా ఉందండి. నా పిచ్చి దేవుళ్లందర్నీ చూడగలుగుతున్నందుకు నాకింకా ఎంతో గర్వంగా ఉంది. వాళ్లు మాత్రం కళ్లుండీ గుడ్డివాళ్లలా నన్ను చూట్టం లేదండి!?

రాతిలో దేవుడిని చూసి దణ్ణాలు పెట్టే ఓ నా దేవుళ్లూ! నన్ను కూడా మీలో ఒకడిగా దేవుడిగా ఎందుకు గుర్తించలేకపోతున్నారో ఇప్పుడు నా కర్థమైంది! కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకునే కర్మభూమిలో నేనో దరిద్రనారాయణుడైపోయాన నేగా?! అయ్యా! నేనూ ఒకప్పుడు మీలా డబ్బున్నవాణ్ణే. బ్లాక్‌మార్కెటీర్ల వల్లా, వడ్డీ వ్యాపారుల వల్లా ఇప్పుడు డబ్బుపోయి జబ్బువాడినయ్యాను.

ఇంతవరకూ క్షమించండి! నన్ను నేను నిందించుకుంటూ ఎంతో సోది చెప్పాను కదూ! ఏం చెయ్యమంటారు చెప్పండి? ఆకలీ— దరిద్రంతో అలమటిస్తున్నవాడు ఏదేదో పిచ్చెక్కినట్లు వాగితే గాని అసలు విషయం చెప్పలేడు. ఇప్పుడదే నా పరిస్థితి కూడా!

నేనలా గుడి ముందు కూర్చునలా అడుక్కుంటుంటే... ఓ చిన్నారి దేవుడు తెలిసో తెలియకో నా చేతిలోకి ఓ కాగితం ముక్కని రాల్చాడు. తినేది కాదనీ, కనీసం. రూపాయి నోటైనా కాదనీ విసిరెయ్యబోయాను. మళ్లీ ఆ కాగితం ముక్క ఏవిటోనని పరీక్షగా చూస్తే... ‘అదో లాటరీ టిక్కెట్టు!’. పాపం! లాటరీలో బహుమతొచ్చుండదు. అందుకే, నా చేతిలోకి విరక్తితో విదిల్చుంటారనుకున్నారు. తీరా చూస్తే నా కాశ్చర్యం కలిగింది. అది మర్నాడు డ్రా తీయ్యవలసింది! ‘ప్రతి మనిషికీ డబ్బుపై ఎంతటాశ?! తేరగా డబ్బు రావాలనీ — కోట్లకి పడగలెత్తాలనీ అనుకుంటాడు.

నా బోటి వాడికో ముద్దెయ్యడానికి చేతులురావు. అత్యాశకిపోయి ఇలా ఎందరో లాటరీ టిక్కెట్లనికొంటారు.’, అనుకున్నాను. మళ్లీ ఆ కుర్రాడి గురించి ఆ చిన్ని దేవుడి గూరించి అయ్యో! పాపం!!’ అనిపించి — ‘బాబూ! బాబూ!!’ అని పిల్చాను. ఆ దేవుడు అయిపుంటేగా? ఎప్పుడో జనంలో కలిసిపోయాడు. విసుగ్గా ఆ టిక్కెట్టుని చింపెయ్యబోయాను. కాని ఎందుకో అలా చెయ్యలేకపోయాను. అంటే నాలోనూ తాపత్రయం పోలేదన్నమాట! నేను దేవుడిని కానన్న మాట!! నాలోనూ ఆశ మినుకు మినుకుమంటూ మొలకెత్తింది. నేనూ ‘అత్యాశాపరుడనే?!’

మర్నాడు కనుక్కుంటే విచిత్రంగా నా చేతిలో పడ్డ ఆ లాటరీ టిక్కెట్టుకే ఫస్టు ప్రయిజ్ పాతిక లక్షలొచ్చింది. పాపం ఆ చిన్నారి దేవుడెవరో?! న్యాయానికీ సంపదంతా అతనిదే! ఇప్పుడీ విషయం నే చెబితే అందరూ వచ్చి మా అబ్బాయే ఈ టిక్కెట్టుని నీ చేతిలో రాల్చాడని పేచీ పెడుతూ నెత్తెక్కి కూచుంటారు. ఎవరికైనా తెలిస్తే నన్ను నాలుగు తన్ని ఈ టిక్కెట్టుని లాక్కున్నా లాక్కుంటారు. ఏం చెయ్యా లిప్పుడు?! మర్నాడెళ్లి నేనా టిక్కెట్టుని బ్యాంకులో ప్రజంట్ చేశాను! బ్యాంకు మేనేజరు ఆ డబ్బుని తమ బ్యాంకులోనే డిపాజిట్ చేసుకుంటానని నా చేత సంతకాలు పెట్టించుకున్నాడు.

ఇప్పుడు నే నింకెవరినీ దేవుళ్లని పిలవనండి? మనుష్యుల్ని మనుష్యులనే పిలుస్తానండి!

జనులొచ్చి నాకు బ్రహ్మరథం పట్టడం మొదలెట్టారండి! ‘ఏనాడే పుణ్యం చేసుకున్నాడో, అందుకే పాతిక లక్షల కధి కార్నయ్యా నన్నారండి! ఈ నాటితో వీడి శని తీరిపోయిందన్నారండి! అంతవరకూ నన్ను చూసి అసహ్యించుకున్న వాళ్లంతా నా దగ్గిర కొచ్చి చేరారండి! ఇప్పుడు నా కనుసైగల్లో మెదలడాని కందరూ సిద్ధమయ్యారండి! మనిషి కన్నా మనిషి తయారు చేసుకున్న డబ్బుకున్న విలువని చూసుకుని నేన్నవ్వుకున్నానండి! మనిషి తయారు చేసుకున్న దేవుడికున్న విలువ మనిషికి లేదుకదండీ?! అందుకే, నవ్వుకున్నానండి! కొందరైతే నాక్కలిగినదృష్టం తమకి పట్టనందు కీర్ష్య పడ్డారండి! ఇంక పత్రికా విలేఖర్లొచ్చి నన్ను రకరకాల ప్రశ్నల్తో విసిగించసాగారండి!

నా మీద దయదల్చిదేవుడొచ్చి నా చేతికే లాటరీ టిక్కెట్టిచ్చెళ్లాడని చెప్పి పగలబడి నవ్వానండి! ‘పాపం! పిచ్చానందం పట్టలేక వెర్రాడ్నయ్యా’ ననుకున్నారండి వారంతా!

సకాలంలో వర్షాలు పడక పంట పోగుట్టుకున్న రోజులన్నాయండి నాకు. అకాల వర్షాలకీ, గాలివానలకీ, వరద ముంపులకి గురై పంట నష్టపోయిన రోజులున్నాయండి నాకు. ఆ రోజుల్లో ఏ దేవుడూ నా దగ్గరకి రాలేదు. నాకు సాయం చెయ్యడానికి! వడ్డీ వ్యాపారుల చేతుల్లో నా జీవితం నలిగిపోయిన రోజుల్లో గానీ, గతిలేక పండిన పంటని నేను దళారులకి చౌకలో అమ్ముకున్న రోజుల్లో గానీ, కట్న— కానుకల్లేకుండా నా కూతుర్ని ఇంటి గడప దాటించలేకపోయిన రోజున గానీ, తెచ్చిన కట్నం చాల్లేదని నా కూతుర్నత్తారింట్లో అమానుషంగా చంపేసిన రోజునగానీ, చివరకి నా పెళ్లాం — బిడ్డలు ఆకలి మంటల కాహుతైన రోజునగానీ ఆ దేవుడు రాలేదండి!

ఇప్పుడీనాడు మనిషి రూపంలో చిన్న కుర్రాడి రూపంలో దేవుడొచ్చి నాకు పెన్నిధినిచ్చాడండి! ఎవరుద్ధరించడానికిటండీ?! నేనీ వయసులో మళ్లీ పెళ్లి చేసుకుని పిల్లల్నెత్తి సంసార సాగరాన్నీదుతానేనా?! ఈ రోగిష్టి మనిషికెందుకండీ అంత డబ్బు? ఎవరి కోసమండీ?! మీరే చెప్పండి!?

నేనేం మాట్లాడనండీ?! నాకు విరక్తి పుట్టిందనుకుంటే అనుకోండి! నా కొచ్చి పాతికలక్షల్నీ, అనాథ శరణాలయాలకీ ఆస్పత్రులకీ రాసిచ్చేశానండి!

ఇంకే ముందండీ? జనం నన్ను పిచ్చాడన్నారండి! ‘సిరిరా మోకాలొడ్డాన’ న్నారండి! ‘ఇంకే జన్మలోనూ దేవుడు నన్ను కరుణించడన్నా’ రండి. తమకైనా నేను సాయం చెయ్యలేనందరూ బాధపడ్డారండి. నానించి దూరంగా పారిపోయిన ఎక్కడెక్కడి బంధువులో నా దగ్గర కొచ్చి శాపనార్థాలెట్టి వెళ్లిపోయారండి!

పత్రికా విలేఖరులు మాత్రమండీ నన్ను ‘మనిషి రూపంలో నున్న దేవుడు’న్నారండి! పత్రికల్లో నా ఫోటో వేసి పతాక శీర్షికలో ఏవేవో రాసేశారండి!!

అప్పుడే నేను పత్రికా విలేఖరులతో చెప్పానండి — ‘అయ్యా! దయుంచి నన్నెవరూదేవుడని పిలిచి అవమానించకండ’ని నన్నిలాగే మనిషిగా వుంచమని కోరుకున్నానండి! ఏమండీ! నేనేమైనా తప్పు చేశానంటారా?!మీరే చెప్పండి?!



పెళ్ళయిన కొత్తలో నేను ఇంటికెళితే ప్రేమతో నా కోసం ఎదురు చూస్తూ నాకు స్వాగతం చెప్పేది నా భార్య. ఆవిడ పెంచుకున్న కుక్క మాత్రం నన్ను కొత్తవాడిగా భావించి మొరిగేది.

ఇప్పుడు?

కుక్క పరుగెత్తుకొచ్చి ప్రేమగా తోకాడిస్తుంది. మా ఆవిడ అరవడం నేర్చుకుంది.

శ్రీనివాస్కే (మల్లారం)